క్లుప్తంగా

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జేవీవీ కార్యాలయంలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు పాలిసెట్ ఫలితాల్లో మంచి ప్రతిభ చూపారు. శనివారం విడుదలైన ఈ ఫలితాల్లో మహిధర్ రెడ్డి 507, పవన్‌సాయి 600, కుళ్లాయమ్మ 1087, మేఘన 3109, షేక్‌మహ్మద్ అద్నాన్ 3608, ధనుంజయ 5471, అక్షయ 7568, సునయన 9918 ర్యాంకు సాధించారు. మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులను జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.శివారెడ్డి, సునీత, నాయకులు మాబువల్లి, మహిత, సింధూరి తదితరులు పాల్గొన్నారు.

క్యారంబోర్డులో శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు క్యారంబోర్డు ఆడటంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే అని చెప్పారు. రచయిత చదువులబాబు, గ్రంథాలయాధికారి ఇబ్రాం సాహెబ్, భాస్కర్, రాజ పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా

రాజుపాళెం : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపారు. మండలంలోని టంగుటూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్‌ఐ తమ సిబ్బందితో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లాలోని గడ్డివాముల్లో, పలువురి ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. జూదం, మట్కా, బెట్టింగ్ వంటివి జరుగుతుంటే 9121100600 కు సమాచారం ఇవ్వాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు సుబ్బారెడ్డి, సిద్దయ్య, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్యా కార్డియాక్, కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వ్యాధుల, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి గుండె వ్యాధులతో బాధ పడేవారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ, గుండె స్కానింగ్ చేశారు. అలాగే డాక్టర్ హరిత కంటి పరీక్షలు చేశారు. ప్రతి నెలా మూడవ ఆదివారం నాడు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సి.శివయ్య, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీ ఉదయం అంకురార్పణ, నవకలశస్నపనం, 24న ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ట, సాయంత్రం శేషవాహనంపై గ్రామోత్సవం, 25న ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, 26న ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 27న ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 28వ తేదీన ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం పుష్పయాగము కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హెచ్‌ఐవీపై సామాజిక స్పృహను పెంపొందిద్దాం



జిల్లా ఆస్పత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల సామాజిక స్పృహను పెంపొందించి సమాజంలో నెలకొన్న వివక్షతను తొలగించడమే ధ్యేయంగా పని చేయాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎంఓ శ్రీధర్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ సూర్యనాగలక్ష్మి, డాక్టర్ శ్రీనివాసులు, డీపీఎంఓ శివశంకరయ్య, ఐసీటీసీ కౌన్సిలర్ బాలగంగిరెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో.. కామనూరు పీహెచ్‌సీలో వైద్యులు హనీఫ్‌బాబా, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినం ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని వీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, సీహెచ్‌ఓలు ఆరోగ్య కార్యకర్తలు అరుణ, దీప్తి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలవాలి

బద్వేలు అర్బన్ : హెచ్‌ఐవీ బాధితుల పట్ల ప్రేమ, అభిమానం కలిగి ఉండటంతో పాటు వారికి ప్రతిఒక్కరు అండగా నిలవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రక్తదానం

పోరుమామిళ్ల : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రమణమ్మకు అత్యవసరంగా రక్తం అవసరమవడంతో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ సుమంత్‌చే రక్తం ఇప్పించారు. రమణమ్మ గ్రూపు రక్తం ఇచ్చేవారు లేకపోవడంతో ఆమె బంధువులు ట్రస్టు నిర్వాహకులు రసూల్, ప్రసాద్‌లను ఆశ్రయించారు.

ఘనంగా పెద్దమ్మకు బోనాలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని లింగాలదిన్నెపల్లె, మల్లేపల్లె గ్రామాల్లో ఆదివారం పెద్దమ్మకు ఘనంగా బోనాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి బోనాలు సమర్పించారు. గ్రామాల్లో ప్రజలు బంధు మిత్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. గ్రామ శివారులోని పోలేరమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ఆవరణలో పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డిశ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ సురేష్‌బాబు పూజలు నిర్వహించారు.

బాడీ ఫ్రీజర్ వితరణ



సేవాశ్రమానికి బాడీఫ్రీజర్ బాక్సును వితరణ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రమణారెడ్డి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద ఫౌండేషన్ సంస్థకు బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి రూ.70 వేల బాడీఫ్రీజర్ బాక్సును ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చేతులమీదుగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనాథశవాలకు అంత్యక్రియలు చేస్తున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థకు రమణారెడ్డి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. అనాథలకు రామకృష్ణారెడ్డి, రామతులసిలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. సేవాశ్రమానికి ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. ఆశ్రమంలోని భోజనశాల మరమ్మతులకు సహాయం అందిస్తామని రమణారెడ్డి, రఘురామిరెడ్డిలు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల : స్వచ్ఛభారత్ కార్మికుల పేరును క్లాప్‌మిత్రగా మార్చి జీతాలు మాత్రం ఇవ్వడంలేదని ఆదివారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మస్తాన్ తెలిపారు. 13 నెలలుగా క్లాప్‌మిత్ర కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛభారత్ కార్మికులను ఏర్పాటు చేసిందని, వారికి జీతాలు చెల్లించడంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం సరైన పద్ధతి కాదన్నారు.

గ్రంథాలయంలో వైద్య పరీక్షలు

రాజుపాళెం : గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపాడు. వైద్యుడు నరసింహారెడ్డి ఇక్కడకు వచ్చిన విద్యార్థులకు పరీక్షలు చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మైదుకూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1982–83లో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఎక్కడెక్కడ నుంచో వచ్చి స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో గెట్ టు గెదర్ నిర్వహించారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి వారి సమక్షంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. ధనపాల జగన్‌మోహన్, సిందే రవిచంద్ర, శీలం వెంకటరాముడు, డాక్టర్ ఉషాదేవి, కె.రవిప్రకాష్, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో కొంతమంది గ్రామస్తులు ఆదివారం వైభవంగా గంగ జాతర (అవుల పబ్బం) నిర్వహించారు. ఉదయాన్నే గ్రామ దేవత గంగమ్మకు తప్పెట్లు, వాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు, స్నేహితులు పెద్దసంఖ్యలో రావడంతో గ్రామం జనసంద్రంగా మారింది. అక్కడకు వచ్చిన వారంతా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సమస్యలు, గొడవలు జరగకుండా ఎస్‌ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

సిద్దవరంలో పోలీసుల నాకాబందీ

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం పంచాయతీలో ఆదివారం సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో నాకాబందీ నిర్వహించారు. పంచాయతీలోని గ్రామాలు తిరిగి అనుమాన ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఎర్రచందనం అనుమానితులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామస్తులను సమావేశ పరచి ఎర్రచందనంపై అవగాహన కల్పించి, ఎర్రచందనం దుంగల కొరకు అడవిలో తిరిగినా, చెట్లు నరికినా, స్మగ్లర్లకు సహకరించినా తీవ్రమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. స్మగ్లర్ల గురించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు చెప్పాలన్నారు.

బ్రాహ్మణ విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం పదో తరగతి, ఇంటర్‌లో 90శాతంపైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు రూ.2వేలు చొప్పున, ఫైల్, పెన్ను, మెమెంటో, ప్రశంసా పత్రం అందించారు. జీవీ శేషశర్మ దంపతులు విద్యార్థులకు నగదు పురస్కారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.కంబగిరిరావు, అధ్యక్షుడు ఆర్‌జీ ప్రసాద్, కార్యదర్శి కేఎల్ రంజన్ శర్మ, మాజీ ప్రధానోపాధ్యాయుడు జీవీ శేషశర్మ, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కపోతకు ఉపశమనం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు వర్షం పడింది. వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు వచ్చి మేఘాలు అలుముకున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడి వాతావరణం చల్లబడింది. వాతావరణం పూర్తి మార్పు చెందడంతో వారం రోజులుగా ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వర్షం కారణంగా కొంత ఉపశమనం లభించింది.

ఎంపీని కేసులో ఇరికించేందుకు కుట్ర

బద్వేలు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఏదో ఒక విధంగా అరెస్టు చేయించాలనే ఉద్దేశ్యంతో ఎల్లో మీడియా కుట్ర పూరితంగా వార్తలు ప్రచురిస్తుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే వివేకానందరెడ్డి హత్య జరిగినా అప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.



